క్లుప్తంగా

షెడ్ల పరిశీలన



జడ్చర్ల టౌన్: వీధి వ్యాపారుల కోసం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు గంజ్ వద్ద నిర్మిస్తున్న షెడ్లను కమిషనర్ మహమూద్‌షేక్ సోమవారం పరిశీలించారు. షెడ్లకు పెయింటింగ్ పనులు కొనసాగుతుండగా, పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌ఛేడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బాలరాజు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సోమవారం స్థానిక సర్పంచ్ నల్లమద్ది విజయలక్ష్మి పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్ రెడ్డి తరుపున బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

యూనిట్లు పెంచాలని వినతి

జడ్చర్ల టౌన్: ముస్లిం మైనార్టీ రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలని ఆయా పార్టీలకు చెందిన నాయకులు సోమవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా మండలంలో కేవలం 17యూనిట్లు అందిస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. 350మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని రుణాల కోసం ఎదురు చూస్తున్నారని, కేవలం 17యూనిట్లు ఇస్తే మిగిలిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తహసీల్దార్‌ను కలసిన వారిలో ఖాజా నసీరొద్దీన్, షకీల్, సాదత్, యూసూఫ్, సద్దాం, నజీర్, మహమ్మద్ ఉన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నిక

జడ్చర్ల టౌన్: మండలంలోని బూరెడ్డిపల్లిలో శ్రీకృష్ణయాదవ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం లిమిటెడ్ అధ్యక్షుడిగా చెన్నకేశవులు ఎన్నుకున్నట్లు జిల్లా సహకార అధికారి కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ నాగరాజు తెలిపారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్, డైరెక్టర్లుగా ఎల్లయ్య, నర్సింహులు, శివకుమార్, కృష్ణయ్య, రాజు, వెంకటేశ్‌లు ఎన్నికయ్యారని ఆయన ప్రకటించారు.

అంతర్జాతీయ సదస్సులో బొటానికల్ గార్డెన్‌పై చర్చ

జడ్చర్ల టౌన్: బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోల్‌కతాలో జరుగుతున్న అంతర్జాతీయ వృక్ష వర్గీకరణ, గిరిజన వైద్యం–బొటానికల్ గార్డెన్స్ అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్ గురించి సమన్వయకర్త సదాశివయ్య వివరించారు. సోమవారం కోల్‌కతాలో జరిగిన సదస్సులో 'అంతరించిపోతున్న స్వదేశీ మొక్కల పెంపకంలో తెలంగాణ బొటానికల్ గార్డెన్ పాత్ర' అనే అంశంపై ఆయన వివరించారు. గార్డెన్ మొదలు పెట్టిన మూడేళ్లలో అనేక వేల మొక్కలు పెంచటమే కాకుండా అటవీశాఖ అధికారులకు అనేక విత్తనాలు, మొక్కలు అందించామని తెలిపారు. అనేక రకాల ఆర్కిడ్ మొక్కలు, ఔషధ మొక్కలైన విషముష్టి, పంచతులసి, నారేప వంటి మొక్కలు పెంచుతున్నట్లు వివరించారు. గార్డెన్ ఏర్పాటు పట్ల వృక్షశాస్త్రవేత్తలు సానుకూలంగా స్పందించారని సదాశివయ్య తెలిపారు.

వ్యక్తికి గాయాలు

జడ్చర్ల: భవనానికి రంగులు వేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురైన సంఘటన సోమవారం బాదేపల్లి పట్టణంలోని సాయినగర్ కాలనీలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గోపాల్(23) సాయినగర్ కాలనీలో రెండతుస్తుల భవనానికి రంగులు వేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదశాత్తు జారి నేలపై పడడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో వైద్య చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ విజయకుమార్ వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన తౌఫిక్, ఇర్ఫాన్ మరో ముగ్గురితో కలిసి గద్వాల నుంచి స్వస్థలానికి ట్రాలీ ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో అడ్డాకుల వద్ద ట్రాలీ ఆటో రెండు టైర్లు పగిలిపోవడంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఆటోలో ఉన్న ఐదుగురిలో తౌఫిక్, ఇర్ఫాన్‌లకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గాయపడిన వారిని పోలీసులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

ప్రజల సంక్షేమానికే 'కంటి వెలుగు'



పోల్కంపల్లిలో..



కాకుంట్లలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దేవరకద్ర రూరల్: కంటి వెలుగు పథకం దేశానికి ఆదర్శంగా నిలిచిందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ అన్నారు. సోమవారం కౌకుంట్ల మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ స్వప్నతో కలిసి కంటి వెలుగు క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యరంగంలో అనేక విప్లవత్మక మార్పులు తీసుకు వచ్చినటట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. అనంతరం వైద్యులు గ్రామసస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూజాత, ఎంపీటీసీ కిష్టన్న, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను చేయించుకోవాలి..

అడ్డాకుల: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలను చేయించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ సూచించారు. మూసాపేట మండలంలోని కనకాపూర్ తండా, పోల్కంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కంటి సమస్యలు ఉండి 18ఏళ్ల వయసు పైబడిన వారందరూ కంటి వెలుగులో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహయాదవ్, కొండయ్య, ప్రవీణ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాలల్గొన్నారు.

247 మందికి కంటి పరీక్షలు..

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటి వైద్య శిబిరంలో సోమవారం 247 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురికి కంటి అద్దాలు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్ల కోసం రెఫర్ చేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా అడ్డాకుల మండలంలోని గుడిబండలో సోమవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కొండా ప్రశాంత్‌రెడ్డితో కలిసి జీఎంఆర్ ఇంటింటికీ తిరిగారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. నాయకులు నాగిరెడ్డి, శెట్టిశేఖర్, లక్ష్మీనారాయణ, శకుంతల, శ్రీహరి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ అభ్యర్థిని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న జి.రఘురాంరెడ్డి

అడ్డాకుల: మార్చి 13న జరిగే ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రఘురాంరెడ్డి కోరారు. మూసాపేట, పోల్కంపల్లి, నిజాలాపూర్, వేముల, జానంపేట, సంకలమద్ది కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించి ఉపాధ్యాయులందరూ చెన్నకేశవరెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. త్వరలోనే ఉపాధ్యాయులకు నగదురహిత వైద్యం ద్వారా హెల్త్‌కార్డులు అమలవుతాయని, వచ్చే ఏప్రిల్ నుంచి పూర్తి స్థాయిలో హెల్త్‌కార్డులు అమలు చేయించే బాధ్యత తమదేనన్నారు. వేసవి సెలవుల్లో పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయించే బాధ్యత సంఘానిదేనన్నారు. కార్యక్రమంలో భాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్‌రావు, రామచంద్రయ్య, బాలకృష్ణ, సాయిరాంగౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

పాలమూరు: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు సఖి బృందం సభ్యులు. సంగారెడ్డి జిల్లా శివాంపేట్‌కు చెందిన 35ఏళ్ల ఓ మహిళ మూడు రోజుల కిందట దారితప్పిపోయి మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. బస్టాండ్‌లో తిరుగుతున్న ఆమెను గుర్తించిన స్థానికులు షీటీం పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ శకుంతల సదరు మహిళను సఖి సెంటర్‌లో అప్పగించారు. సఖి సెంటర్ కో–ఆర్డినేటర్ మంజుల ఆధ్వర్యంలో మహిళ వివరాలు, కుటుంబీకుల ఫోన్‌నంబర్ సేకరించారు. ఆనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మహబూబ్‌నగర్‌కు రప్పించారు. మహిళ భర్తతో పాటు అన్నయ్య వచ్చిన తర్వాత ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి ఆమెకు రెండు జతల దుస్తులు, ఒక ప్రత్యేక కిట్ అందజేసి అప్పగించారు.

మర్దాన్ అలీషా దర్గా ఉత్సవాలు



దర్గా ప్రాంగణంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్టలోగల హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీషా దర్గా ఉర్సు ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలి రోజు రాత్రి దర్గాలో భక్తిశ్రద్ధలతో గుస్లే షరీఫ్ (జలాభిషేకం) నిర్వహించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు భక్తిగీతాలు ఆలపించారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ తెలిపారు. అదేవిధంగా ఉర్సు వేడుకల్లో భాగంగా ఈనెల 15న దీపారాధన, ఖవ్వాలి ఉంటుందని, 16న దర్గాలో ఖత్‌మే ఖురాన్ నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాది రవికుమార్‌యాదవ్

నవాబుపేట: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని న్యాయవాది రవికుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని లింగంపల్లిలో పాలమూరు యునివర్సిటీ విద్యార్థులు, మహిళా సంఘాల సమాఖ్యతో కలిసి న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా అందరికీ ఉచిత న్యాయసేవా అందించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగా రెడ్డి, గాలెన్న, జీవరత్నం, లక్ష్మమ్మ, భాగ్యమ్మ, కాంచన తదితరులు పాల్గొన్నారు.

మండల ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించాలి



మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దమాయపల్లి గేటు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో కార్యక్రమానికి ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ పాలన సౌలభ్యం కోసం గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.మహేందర్‌గౌడ్, జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివస్వాముల పాదయాత్ర



దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలంలోని ఇస్రంపల్లికి చెందిన శివస్వాములు సోమవారం గ్రామం నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేపట్టారు. స్థానికంగా ఉన్న శివాలయంలో పూజారిమఠం సురేష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ రాఘవేందర్ రెడ్డి శివస్వాములకు శాలువాలు కప్పి సత్కరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గండేడ్: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మహమ్మదాబాద్ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం గండేడ్ మండలంలోని వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేసారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ చైర్మన్ చిన్నయ్య, ఇజాజ్, భీమయ్య, బాల్‌రాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీముదిరాజ్ అన్నారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్ రవి నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో బీసీలకు కేవలం 2శాతం నిధులు కేటాయిచడం సరికాదన్నారు. దేశంలో బీసీ కులగణనను వెంటనే చేపట్టాలన్నారు. జనాభా దమాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 29నుంచి 50శాతానికి పెంచాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, ఆనంద్‌గౌడ్, బాలరాజు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

దంపతుల వ్రతాలు

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో ప్రధాన అనఘాష్టమి(అనఘాదేవి) వ్రతం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దత్తపీఠం ఆవరణలో దత్తపీఠాధిపతి సత్యహరిశ్చంద్ర గురుదత్త ఆధ్వర్యంలో సర్పంచ్ పుల్లారెడ్డితో పాటు దాదాపు 300 జంటలతో వ్రతాన్ని నిర్వహించారు. ముందుగా దత్తాత్రేయుడి పూజ నిర్వహించి వ్రతాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నాణ్యతగా చేపట్టాలి

కోయిల్‌కొండ: మండలంలోని కేశ్వాపూర్‌లో చేపడుతున్న సీసీరోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని సర్పంచ్ మొగులయ్య అన్నారు. సోమవారం ఆయన సీసీరోడ్డు పనులను పరిశీలించారు. గ్రామంలో 150మీటర్లు మేర సీసీరోడ్డు వేయడం జరుగుతుందని, ఎన్ఆర్‌ఈజీఎస్ రూ.5లక్షలు, జిల్లా పరిషత్ రూ.3లక్షలు, గ్రామ పంచాయతీ ద్వారా రూ.2లక్షలతో రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణ శివారులోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మాఘ బహుళ నవమి మొదలు ఏకాదశి వరకు అంటే మంగళవారం ప్రారంభమై గురువారంతో ఉత్సవాలు ముగియనున్నాయి. లోక కల్యాణార్థం నవగ్రహా, నందీశ్వర, శివలింగ, అభయాంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు అయ్యప్ప సేవా సమితి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యాహ వాచనము తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు రంజిత్‌బాబు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప ఉత్సవాలు



బీరప్ప ఉత్సవాల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి

చిన్నచింతకుంట: మండలంలోని నెల్లికొండిలో గొల్లకుర్మలు సోమవారం బీరప్ప ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బీరప్పస్వామి ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య గ్రామంలో ఊరేగించారు. ఆలయం వద్ద బీరప్ప స్వామి విగ్రహానికి గంగాజలాలతో అభిషేకించారు. అనంతరం బండారును ఒకరిపై ఒకరు చల్లుకొని పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాము, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

అడ్డాకుల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం వేములలో నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. 45జట్లు పాల్గొన్న పోటీల్లో మూలమల్ల జట్టు భీంపూర్ జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. వేముల, కంచిరావుపల్లి జట్లు మూడు, నాలుగో స్థానంలో నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌ను తిలకించిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విజేతలకు నగదుతో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జేపీఎన్ఈసీ చైర్మన్ కేఎస్ రవికుమార్, టీపీసీసీ కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్, జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, స్థానిక సర్పంచ్ అరుణ రఘుపతి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్, వివిధ పార్టీల నాయకులు లక్ష్మీనర్సింహా, రాఘవరెడ్డి, కొండయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో సినీనటుడు సుమన్, కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాత్రి ముగిసిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ (సీఎం కప్–2023)లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు సత్తాచాటినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో కింగ్‌షోటోకాన్ క్లబ్ విద్యార్థులు 11 పతకాలు సాధించినట్లు తెలిపారు. క్లబ్ విద్యార్థులు టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచి 5 బంగారు, 4 రజతం, 2 కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. మహ్మద్ ఉజేఫ్ షరీఫ్ అండర్–17 విభాగంలో బ్రౌన్, బెల్టు కటాస్‌లో బంగారు పతకం, కుమితేలో రజత పతకం, మారియబేగం 15ఏళ్ల పైబడి విభాగం వైట్‌బెల్టు కటాస్‌లో రజత పతకం, గ్రీన్ బెల్టులో అజయ్‌కుమార్ బంగారు పతకం, అండర్–13 విభాగం ఎల్లో బెల్టు కటాస్‌లో నవీన్‌కుమార్ బంగారు పతకం, అండర్–15 బ్రౌన్, బ్లాక్‌బెల్టులో మహ్మద్ అమాన్‌ఖాన్ రజత పతకం, అండర్–14 విభాగం బ్లూబెల్టు కటాస్‌లో మహ్మద్ బాలే షరీఫ్ రజత పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులకు సినీనటుడు సుమన్, మలేషియాకు చెందిన కరాటే మాస్టర్ కె.అనంతన్, దుబాయ్‌కి చెందిన మాస్టర్ రువాన్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించినట్లు జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు.

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నాగరాజు

అడ్డాకుల: పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై భయం వీడి ప్రశాంతంగా చదువుకోవాలని రిటైర్డ్ ప్రొఫెసర్ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎలైట్ 320డీ ఆధ్వర్యంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని 130 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమాపతి, లయన్స్ క్లబ్ నాయకులు చంద్రశేఖర్, శ్రీధర్, స్థానికులు చంద్రమోహన్‌రెడ్డి, రమేష్, మల్లికార్జున్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు బుద్ధి చెబుదాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు ప్రజలంతా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఓబ్లాయిపల్లిలో స్ట్రీట్ కార్నర్ సమావేశం మండల అధ్యక్షుడు రాజుగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రైతుబంధు ఇస్తూ రాయితీ రుణాలు, వ్యవసాయ యంత్రాలపై ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం లేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమాలు దేవుడి భూములను కూడా వదలడం లేదని ఆరోపించారు. సమావేశంలో నాయకులు ఎన్పీ వెంకటేష్, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, పాండురంగారెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

బాలానగర్: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకుల కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 12శక్తి కేంద్రాలకు ఇన్‌చార్జ్‌లు, సహ ఇన్‌చార్జ్‌లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అవినాష్,శ్రీనివాస్, సమ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: ఈనెల 3న ప్రారంభమైన పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు రోజున స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించి గరుడ, శేషవాహన సేవలపై ఊరేగించారు. ఊరేగింపు అనంతరం ఆలయంలో చక్రతీర్థం జరిపించటంతో ఉత్సవాలు ముగిశాయి.

ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే మహాభోగ్ కార్యక్రమానికి హాజరయ్యే గిరిజన ఉద్యోగులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని టీఎస్ జీఓ జిల్లా కార్యదదర్శి చంద్రనాయక్ కోరారు. గిరిజన ఉద్యోగుల సంఘం, గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి మంత్రి, కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవుజానాయక్, అంతిరాంనాయక్, గోపాల్ నాయక్, చత్రునాయక్, పాండు పాల్గొన్నారు.